సికిల్ 'హెల్'..!

మనకు సోకే కొన్ని రకాల వ్యాధులు ప్రాణాంతకం కాకపోయినప్పటికీ.. నరకం (హెల్) అంటే ఎలా ఉంటుందో చూపిస్తాయి. అంటే.. అంతగా ఇబ్బంది కలిగిస్తాయన్న మాట. అలాంటి వ్యాధుల్లో ఒకటి- రక్తహీనత (సికిల్ సెల్ అనీమియా). నిన్నటి రోజున 'అంతర్జాతీయ సికిల్ సెల్ అనీమియా నివారణ దినోత్సవం' సందర్భంగా జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ వ్యాధి పుట్టుక-నివారణ తదితరాంశాలను వైద్య నిపుణులు వివరించారు.

భద్రాచలం: పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

దమ్మపేట: విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదివాసీలకు 'వారసత్వ' జబ్బు

భద్రాచలం, జూన్ 19: ఏజన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన గూడెల్లోని పిల్లలకు సికిల్ సెల్ అనీమియా (రక్తహీనత) వ్యాధి వారసత్వంగా వస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. దీనిని త్వరగా గుర్తించి, వైద్యం చేయించుకుంటే వెంటనే నయమైపోతుందని చెప్పారు. ప్రపంచ సికిల్ సెల్ అనీమియా నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. దీనిని కలెక్టర్/ఇన్‌చార్జ్ పీవో జితీష్ వి పాటిల్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యాధి ప్రాణాంతకమైనది కాదని చెప్పారు. మన శరీరంలోని ఎర్ర రక్త కణాలు 120 రోజులకు నశించి, తిరిగి కొత్తవి వస్తుంటాయని అన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి మాత్రం 20 రోజుల్లోనే ఎర్ర రక్త కణాలు నశించడంతో రక్తహీనత ఏర్పడుతుందని చెప్పారు. దీని ఫలితంగా విపరీతమైన నొప్పి వస్తుందని, చేతులు-కాళ్లకు వాపు/ఇన్ఫెక్షన్లు వస్తాయని, శారీరక పెరుగుదల ఆలస్యమవుతుందని, దృష్టి సమస్యలు (అంధత్వం) వస్తాయని, అవయవ నష్టం ఉంటుందని, తీవ్రమైన ఛాతీ నొప్పి/ గుండె జబ్బు వస్తుందని, అల్సర్ వంటి సమస్యలు ఏర్పడతాయని వివరించారు. దీని వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స తీసుకుంటే తగ్గిపోతుందని అన్నారు. ముఖ్యంగా గర్భిణులు ముందుగా సికిల్ సెల్ అనీమియా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన వైద్యం చేయించుకోవాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. పుట్టే బిడ్డ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. గిరిజనులు ఎక్కువగా మూఢ నమ్మకాలతో ఇంగ్లిష్ వైద్యం చేయించుకోరని, అందుకే ఆదివాసీ గూడెల్లో సికిల్ సెల్ అనీమియా పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించేందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. కలెక్టర్/ఇన్‌చార్జ్ పీవో మాట్లాడుతూ.. ముఖ్యంగా ఆదివాసీ గ్రామాల్లోని గిరిజన పిల్లల కోసమే ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించినట్లు చెప్పారు. మంచినీరు సరిగ్గా దొరకని గ్రామాల్లోని వారికి ఈ వ్యాధి సోకుతుందని చెప్పారు. రక్తహీనత వ్యాధిని గుర్తించేందుకు 15 రోజులపాటు రోజూ వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తుందని చెప్పారు. ట్రైకార్ జీఎం కుంజా శంకర్‌రావు, ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఏపీవో (జనరల్) డేవిడ్ రాజ్, ఆర్డీవో దామోదరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, పట్టణ సీఐ సంజీవరావు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, ఏసీఎంవో రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పొట్టికాహారం, రాగి జావ తీసుకోవాలి

చుంచుపల్లి, జూన్ 19: సికిల్ సెల్ అనీమియాపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని మండలంలోని పెనగడప పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నేహా అమ్రిన్ అన్నారు. నులి పురుగుల నివారణపై రుద్రంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పౌష్టికాహారం, రాగి జావా తీసుకోవాలన్నారు. ఎంపీవో గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు, హెచ్ఎం బాలాజీ, టీచర్లు జయలక్ష్మి, శ్రీదేవి, రుద్రంపూర్ సబ్ సెంటర్ డాక్టర్ నవ్యజ్యోతి, సిబ్బంది వెంకటేశ్వర్లు, పూర్ణారావు, చంద్రకాంత్, రాణి, మణి, బి.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు కృపమ్మ, అనూష పాల్గొన్నారు.

జన్యుపరమైన లోపాలే కారణం

దమ్మపేట, జూన్ 19: సికిల్‌సెల్ అనీమియా వ్యాధికి జన్యుపరమైన లోపాలే కారణమని దమ్మపేట వైద్యాధికారి డాక్టర్ మణిదీప్ అన్నారు. దమ్మపేట గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఈ వ్యాధిపై బుధవారం అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తే తగ్గుతుందని చెప్పారు. నులి పురుగుల నివారణకు ఆల్‌బెండాజోల్ మాత్రలను అందరూ వేసుకోవాలన్నా. జడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ జానూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అన్నపురెడ్డిపల్లి, జూన్ 19: మండలంలోని ఎర్రగుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం సికిల్‌సెల్ అనీమియా (రక్తహీనత) స్క్రీనింగ్ పరీక్షలను వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ర్యాలీ

బూర్గంపాడు, జూన్ 19: సికిల్ సెల్ అనీమియా, నులి పురుగుల నివారణ దినోత్సవంపై బుధవారం మండలంలోని మోరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆల్బెండాజోల్ మాత్రలు వేయనున్నట్లు చెప్పారు. సిబ్బంది సత్యవతి, సోమ్లా, రవి, దేవి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

టేకులపల్లి, జూన్ 19: రక్తహీనత పరీక్షలు చేయించుకున్న వారికి గుర్తింపు కార్డులను ఎంపీపీ బానోత్ మౌనిక బుధవారం పంపిణీ చేశారు. సులానగర్ పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ విజయశ్రీ, సిబ్బంది వజ్జా పార్వతి, చంద్రకళ, దేవా, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శకుంతల, విజయ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు నిత్య కల్యాణం

నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూన్ 19: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దివ్య క్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు బుధవారం నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

పామాయిల్ ఫ్యాక్టరీ సందర్శన

పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

అశ్వారావుపేట, జూన్ 19: విద్యా నైపుణ్యంలో బాగంగా స్థానిక వ్యవసాయ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు బుధవారం దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీ పనితీరును వారికి ఆయిల్‌ఫెడ్ రీజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ వివరించారు. పామాయిల్ సాగు, ప్రభుత్వ సబ్సిడీలు, రైతులకు లభించే ఆదాయం, గెలల సేకరణ, క్రషింగ్, ఆయిల్ రికవరీ, నిల్వ, మార్కెటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.సాయి కిషోర్, ఎస్.జగదీష్ పాల్గొన్నారు.

ఆళ్లపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా శ్రీనివాస్

ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు,ప్రజాప్రతినిధులు

ఆళ్లపల్లి, జూన్ 19 : మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఆర్.రమాదేవి కొంతకాలంగా అనారోగ్య కారణంగా విధులకు హాజరుకాకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న బత్తిన శ్రీనివాస్‌కు అదనపు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా బుధవారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఆయనకు శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ ఎల్లయ్య, వైద్యులు రేవంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై ముగిసిన శిక్షణ

శిక్షణ ముగించుకున్న వారితో ఏఎస్పీ

భద్రాచలం, జూన్ 19: నూతన చట్టాలపై పోలీసులకు నాలుగు రోజులపాటు భద్రాచలంలో శిక్షణా తరగతులు జరిగాయి. బుధవారం ముగింపు కార్యక్రమంలో సర్టిఫికెట్లను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అందజేశారు. పట్టణ సీఐ సంజీవరావు, ఎస్సై పీవీఎన్ రావు పాల్గొన్నారు.

డ్రైవింగ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ పూర్తి

రామవరం, జూన్ 19: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న కొత్తగూడెం రీజియన్ అంతర్గత ఈపీ ఆపరేటర్ డ్రైవింగ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ బుధవారంతో ముగిసింది. మొత్తం 166 మంది హాజరయ్యారు. వీరిలో 86 మంది అర్హత సాధించి, రాత పరీక్షకు ఎంపికయ్యారు.

దేవాలయ భూముల పరిశీలన

భూములను పరిశీలిస్తున్న సులోచన

అన్నపునరెడ్డిపల్లి, జూన్ 19: స్థానిక శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయ భూములను దేవాదాయ-ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన బుధవారం పరిశీలించారు. ఆలయంలో అధికారులు, దేవాలయ భూముల కౌలు రైతులతో సమావేశమయ్యారు. రైతులు సకాలంలో కౌలు చెల్లించి, దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పదోన్నతులు, బదిలీ ప్రక్రియ కొనసాగించాలి

పాఠశాలలో ఆందోళన వ్యక్తం చేస్తున్న ఐటీడీఏ యాజమాన్య ఉపాధ్యాయులు

గుండాల, జూన్ 19: ఐటీడీఏ యజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల అతీతంగా బుధవారం మండలంలోని శంబునిగూడెం ఆశ్రమ పాఠశాల మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాలు రమేశ్ మాట్లాడుతూ.. 13 సంవత్సరాలుగా ఒకే పాఠశాలలో పనిచేస్తూ మానసిక వేదనకు గురవుతున్నామని వారు వాపోయారు. ఉపాధ్యాయ సంఘాలు అన్ని ఐటీడీఏ పాఠశాల ఉపాధ్యాయులను ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయులుగా సవతితల్లి ప్రేమను కనబరుస్తూ మమ్మల్ని విస్మరిస్తున్నారని, కేవలం ఉద్యమాలకు, ఆందోళనకు మాత్రమే మమ్మల్ని పరిమితం చేయడం శోచనీయం అని అన్నారు. ఉపాధ్యాయులు రామయ్య, హరిలాల్, ప్రమోద్ పీఈటీ, బాలు, వసంతచ చిన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏరియా జీఎం

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏరియా జీఎం

రామవరం, జూన్ 19: కొత్త కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను సింగరేణి ఏరియా జీఎం శాలంరాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. జీకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీరమేష్, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ తావుర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన చైర్‌పర్సన్

పుష్పగుచ్ఛం ఇస్తున్న చైర్‌పర్సన్

కొత్తగూడెం అర్బన్, జూన్ 19: కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కమిషనర్ శేషాంజన్ స్వామి, మేనేజర్ ఎల్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు

కొత్తగూడెం అర్బన్/అశ్వారావుపేట జూన్ 19: సీఎం రేవంత్‌రెడ్డిని కొత్తగూడెం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, జారే ఆదినారాయణ బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిశారు. తమ తమ నియోజకవర్గాల్లోని సమస్యలపై చర్చించారు.

గంజాయి పట్టివేత

పాల్వంచలో 202 కిలోలు..
టేకులపల్లిలో 158 కిలోలు

టేకులపల్లి: కారు, నిందితులతో ఎస్సై రవూప్, సిబ్బంది

పాల్వంచ: పట్టుకున్న గంజాయితో పోలీసులు

పాల్వంచ, జూన్ 19: ఏపీలోని డొంకరాయి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న గంజాయిని పాల్వంచ పోలీసులు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. పాల్వంచ జాతీయ రహదారిలోని జీసీసీ గోడౌన్ ఎదురుగా పట్టణ రెండవ ఎస్సై రాఘవ, సిబ్బంది కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మారుతి కారు నుంచి 100 ప్యాకెట్లలో ఉన్న 202 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. దీనిని తరలిస్తున్న వికారాబాద్ జిల్లాకు చెందిన మెగావత్ జైపాల్‌ను అరెస్ట్ చేశారు. కేసును ఎస్సై బాణాల రాము దర్యాప్తు చేస్తున్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి, జూన్ 19: గంజాయిని, దానిని తరలిస్తున్న వారిని టేకులపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై సైదా రవూఫ్ తెలిపిన వివరాలు.. బేతంపూడి పంచాయతీ పరిధి వెంకట్యాతండా గ్రామ సమీపాన కొత్తగూడెం-ఇల్లెందు ప్రధాన రహదారిపై ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మారుతి కారు(టీజీ 030 141) డిక్కీ నుంచి 79 ప్యాకెట్లలో ఉన్న 158 కేజీల గంజాయిని పట్టుకున్నారు. దీని విలువ రూ.39.50 ఉంటుందని అంచనా. కారులో ఉన్నలో కామారెడ్డి జిల్లాకు చెందిన పెనుగొండ వెంటరాజును, బోదాసు తిరుపతిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని షోలాపూర్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. కారు సహా గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. ఆ ఇద్దరిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేశారు.

వర్షపు జల్లులు

అశ్వారావుపేట రూరల్: రామన్నగూడెంలో వర్షం

చండ్రుగొండ: కురుస్తున్న ముసురు వాన

అశ్వారావుపేట రూరల్, జూన్ 19: మండలంలోని రామన్నగూడెం, పండువారిగూడెం, మల్లాయిగూడెం, అనంతారం, గాండ్లగూడెం, బచ్చువారిగూడెం, నారాయణపురం, ఆసుపాక, మామిళ్లవారిగూడెం, వినాయకపురం గ్రామాల్లో బుదవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు వర్షపు జల్లులు పడ్డాయి. కొన్నిచోట్ల మాత్రమే రైతులు ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు చేపట్టారు. మరికొన్ని ప్రాంతాల్లో జీలుగు, జనుము విత్తనాలు నాటారు.

చండ్రుగొండ, జూన్ 19: మండలవ్యాప్తంగా బుధవారం తెల్లవారుఝాము నుంచి ఉదయం వరకు మోస్తరు వాన కురిసింది. వాన కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇది ఊరటనిచ్చింది.

పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి

కరకగూడెం, జూన్ 19 : మండలంలోని రేగళ్ల పంచాయతీ పడిగాపురంలో మంగళవారం రాత్రి వర్షంతో పాటు పిడుగు పడడంతో రెండు ఎద్దులు, ఒక లేగదూడ మృతి చెందాయి. గ్రామానికి చెందిన కొమరం జోగయ్య అనే రైతుకు చెందిన ఎద్దులు, లేగ దూడ సాయంత్రం మేతకు వెళ్లి వర్షం కురవడంతో చెట్టుకిందకు వెళ్లిన క్రమంలో పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

సరుకుల సరఫరా టెండర్లకు ఆహ్వానం

భద్రాచలం, జూన్ 19: భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని 27 గిరిజన సంక్షేమ గురుకులాలకు, ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాలకు కోడిగుడ్లు, కూరగాయలు, పండ్లు, స్కిన్‌లెస్ చికెన్, కేటరింగ్ సేవలు, స్వీపింగ్ అండ్ శానిటేషన్ సిబ్బందిని సరఫరా చేసేందుకు సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో జితీష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా టెండర్ ఫారాలను సమర్పించాలని పేర్కొన్నారు. టెండర్లను ఈ నెల 26న ఉదయం 11 గంటలకు తెరవనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 91825 52138 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

సరుకులు నాణ్యంగా ఉండాలి

భద్రాచలం, జూన్ 19: గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు నాణ్యతతో కూడిన సరుకులను మాత్రమే సరఫరా చేయాలని ఐటీడీఏ ఏపీవో (జనరల్) డేవిడ్ రాజ్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం టెండర్ ప్రక్రియలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పేరందిన ఏజన్సీలను టెండర్ పద్ధతిన ఎంపిక చేశామన్నారు. నాణ్యత లేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకుల ఆర్సీవో వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

వ్యక్తిపై సామూహిక దాడి

చింతకాని, జూన్ 19: మండలంలోని అనంతసాగర్ చెరువు సమీపంలో రాత్రి వడ్లమూడి సత్యనారాయణపై కొందరు వ్యక్తులు సామూహిక దాడికి పాల్పడ్డారని బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చేతులు కట్టేసి బలవంతంగా పలు పేపర్లపై తన వేలిముద్రలు తీసుకున్నట్లు సత్యనారాయణ పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలానికి చెందిన కొందరు వ్యక్తులతో తనతో ఆస్థి వివాదం ఉన్నదని, వారే ఆ పని చేసి ఉండవచ్చని ఫిర్యాదులో తెలిపాడు. ఘటనా స్థలాన్ని వైరా సీఐ నునావత్ సాగర్ సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, జూన్ 19: మండలంలోని మాదిరిపురం గ్రామానికి చెంది న పేపర్ ఏజెంట్ పట్ల ప్రభాకర్(56) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ప్రభాకర్ మృతికి పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు నివాళి అర్పించారు. మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పెనుబల్లి, జూన్ 19 : పెనుబల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండలంలోని టేకులపల్లి గ్రామానికి చెందిన నవీన్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా పెనుబల్లి మజీద్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ తలకు తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, జూన్ 19 : పట్టణంలోని స్వామి వివేకానంద పార్క్‌లో మున్సిపాలిటీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను, అదేవిధంగా జలగం వెంగళరావు పార్క్‌ను బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పరిశీలించారు. రాబోయే రోజుల్లో పార్క్‌ను చాలా సుందరంగా తీర్చిదద్దడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మట్టా దయానంద్‌విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ రవికుమార్, నాయకులు చల్లగుల్ల నరసింహారావు, గాదె చెన్నారావు, టోపీ శ్రీను, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం

వైరారూరల్/వైరాటౌన్, జూన్ 19 : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అల్బెండ జోల్ మాత్రలు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రజలందరూ మీ దగ్గరలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో, కళాశాలల్లో ఉచితంగా పిల్లలకు వేయించాలన్నారు.

మలీదు పద్మకు నివాళి

ఖమ్మం రూరల్, జూన్ 19: ఇటీవల మరణించిన అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సతీమణి, పీవోడబ్ల్యూ నాయకురాలు మలీదు పద్మ చిత్రపటానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాళి అర్పించారు. మండలంలోని కాచిరాజుగూడెం స్వయంగా వెళ్లి మలీదు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పద్మ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాయల నాగేశ్వరరావు, కళ్లెం వెంకటరెడ్డి తదితరులున్నారు.

IN THE LAND ACQUISITION REHABILITATION AND RESETTLEMENT AUTHORITY
C.C.L.A. COMPLEX, NAMPALLY STATTION ROAD, HYDERABAD.
LAOP NO. 19/2020
Between :
Land Acquisition officer & Special Deputy Collector, Seetha Rama Lift Irrigation Project, Paloncha, Bhadradri Kothagudem District ...Referral Authority
Vrs
1). Kunja Laxmi & Others ... Claimants
To
10). Boddu Biksham S/o. Bhadraiah, Age :75 Years, Occ : Agriculture, R/o. Kamalapuram (V), Mulakalapally Mandal, Bhadradri Kothagudem District Claimant No.10
NOTICE
Your Claimant No.10 above LAOP. The Authority Order Notice to you for your appearance by way of paper publication vide I.A.No.609/2024, dated 14-06-2024. Therefore you should attend before the Hon'ble Authority on 19.07.2024. at about 10.30 AM by person or Through your counsel before the authority, otherwise the Hon'ble Authority will take Appropriate steps against you in your absence. Hence the Appearance Notice.
//by order of the Authority//
R. VENKATA RATNAM
A.MANORAMA, Advocates, Kothagudem, cell : 9849125619

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616